క్లుప్తంగా

అక్రమ కట్టడాలు తొలగించాలి

కడప సెవెన్‌రోడ్స్: బద్వేల్ పట్టణం, గోపవరం మండలం మడకలవారిపల్లెలోని 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని జిల్లా పోరాట సాధన కమిటీ నాయకులు నారాయణ రెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, సీఎస్.ఆంజనేయులు, గుర్రప్ప శనివారం కలెక్టర్‌కు విన్నవించారు. మున్సిపల్ కమిషనర్ కూడా కబ్జాలు జరిగిన మాట నిజమేనని, వాటిని తొలగిస్తామని చెప్పి 72 రోజులైనా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయానికి కూలర్, ఫ్యాన్లు వితరణ


కూలర్, ఫ్యాన్లు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు అమలు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా దేవుని కడప సోమేశ్వరాలయానికి వాటర్ కూలర్, రెండు పెడల్ ఫ్యాన్లు బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు వేసవి ఎండల నుంచి ఉపశమనం కల్పించేందుకు వాటిని అందజేశామని, పుణ్యక్షేత్రాలను ప్రోత్సహించేలా తాము ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం రమేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 35 రోజులపాటు ఈ శిక్షణ ఉంటుందని, ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణానంతరం ప్రతిభను బట్టి వివిధ సంస్థల్లో రూ. 15 వేల వేతనంతో ఉపాధి కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

మహిళకు రక్తదానం


రక్తదానం చేస్తున్న కేద్రిబాబు


కడప కల్చరల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక మహిళకు స్థానిక శాంతి సేవా సొసైటీ సభ్యుడు రక్తదానం చేసి కాపాడారు. కడప నగరం ఆర్కే నగర్‌కు చెందిన ఈశ్వరమ్మ అనారోగ్యంతో రిమ్స్ ఆస్పత్రిలో చేరింది. చికిత్సలో భాగంగా రక్తం అవసరమవడంతో శాంతి సేవా సొసైటీ సభ్యుడు మడగలం మనోహర్ రక్తదాతను ఏర్పాటుచేశారు. సంస్థ సభ్యులైన కేద్రిబాబు రక్తదానం చేశారు.

మెలకువలు పాటించాలి


డ్రైవరుకు సలహాలిస్తున్న కృష్ణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు విధి నిర్వహణలో మెలకువలు పాటించి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఆయన పలు బస్సుల్లో ప్రయాణం చేసి డ్రైవర్లకు సూచనలు చేశారు. బీఎస్–6 బస్సుకు మెరుగైన కేఎంపీఎల్ రావాలంటే నడిపే సమయంలో 1, 2, 3 గేర్‌లో ఎక్స్‌లేటర్ ఇవ్వరాదన్నారు. 4వ గేర్ నుంచి సరైన ఆర్‌పీఎంలో మార్చాలన్నారు. ఎక్స్‌లేటర్ పూర్తిగా తొక్కడం, పంపింగ్ చేయడం చేయరాదన్నారు. 15 ఆర్‌పీఎం దాటకుండా బస్సును నడపాలని, అవసరం లేని సమయంలో బ్రేకులు వేయరాదని సూచించారు. ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా ఉంటూ బస్సును సకాలంలో గమ్యస్థానాలకు చేర్చాలన్నారు.


వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు

కడప కార్పొరేషన్: నెల్లూరు జిల్లా ఆత్మకూరు రవితేజ కళ్యాణ మండపంలో వల్లి నాగార్జున రెడ్డి, లక్ష్మీదేవిల కుమార్తె సౌమ్య, ప్రసన్నకుమార్‌రెడ్డిల వివాహ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన సాయి యువజన సేవా సంఘం చైర్మన్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఆవుల సునీల్‌కుమార్‌రెడ్డి, డి.సుబ్బరాయుడు, కొండా మల్లికార్జున తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కళింగర పండు.. ఆరోగ్యం మెండు


విక్రయానికి సిద్ధంగా కళింగర కాయలు


ముక్కలుగా కోసిన కళింగర కాయలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుతం ఎండలుమండిపోతున్నాయి. ఉదయం పది గంటలు దాటితే వేడి గాలులు ప్రారంభమవుతున్నాయి. అత్యవసర ప్రయాణం చేసే ప్రయాణీకులతోపాటు విద్యార్థులు, ఉద్యోగులకు పాట్లు తప్పడం లేదు. ఒకవైపు ఇంటర్, టెన్త్ పరీక్షలతో విద్యార్థులు సతమతవవుతున్నారు. ఈ సమయంలో దారి పొడవునా నేన్నానంటూ అటు దాహార్తి, ఇటు ఆకలిని తీరుస్తోంది కళింగర పండు. దీనిని పుచ్చకాయ అని కూడా పిలుస్తారు. సాధారణ వ్యక్తి కూడా కొనుగోలుచేసి తినగలిగే దివ్య ఫలంగా ఇది అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంటోంది.

విరివిగా విక్రయాలు

కడప నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో కళింగర పండ్ల విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. రోడ్ల వైపున చిరు వ్యాపారులు సైతం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో రోడ్ల ప్రక్కన వ్యాపారుల్లో అధికంగా ఈ కాయల వ్యాపారమే ఎక్కువగా కనిపిస్తోంది. ఇతర పండ్లు, ఫలాలతో పోలిస్తే పుచ్చ కాయలు సరసమైన ధరలతో లభిస్తున్నాయి. రూ.100కు కాయ కొనుగోలుచేస్తే ఇంటిల్లిపాదీ స్వీకరించవచ్చు. ఇవి మన ప్రాంతంలో పండే పంట కంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కాయలు పెద్దవిగా ఉంటున్నాయి. ఈ కళింగర కాయలను మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి.

శుభకార్యాలలో...

కళింగర కాయ అంటే ఇష్టపడని వారంటూ ఉండరు. చిన్నపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఈ కాయను తింటారు. అలాగే వివాహాలు, శుభ కార్యాలు జరిగే సందర్భాల్లోనూ కూడా, అలాగే తమ ఇళ్ల వద్ద నిర్వహించే ఫంక్షన్లలో కోసి వచ్చే వారికి అందిస్తున్నారు. పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మంచిది. దాహార్తిని తగ్గిస్తుంది. చెమట ద్వారా వచ్చే ఖనిజ లవణ లోపాలను తగ్గిస్తుంది. జ్వరంతో బాధపడుతున్న వారు ఈ కాయ రసంలో తేనె కలిపి సేవిస్తే శారీరక నీరసం తగ్గి శక్తి వస్తుంది. మలబద్దకం ఉన్న వారు ప్రతిరోజు పుచ్చకాయ తింటే సమస్య అంతరించిపోతుంది. ఎండిన పెదవులను తడిగా ఉంచుతుంది. పుచ్చకాయలో ఉన్నంత నీరు మరే పండులోనూ ఉండదు. మూత విసర్జనలో మంట ఉన్న వారికి పుచ్చకాయ రసంలో స్పూన్ తేనె కలిపి ప్రతిరోజు తీసుకుంటే గుండెజబ్బులు, మూత్రపిండాల వ్యాధులు తగ్గుతాయి.

మూడు నెలలపాటు సీజనల్ వ్యాపారం

ఏడాదిలో మూడు నెలలపాటు పుచ్చకాయల వ్యాపారం ఉంటుంది. ఇతర జిల్లాల నుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకుంటున్నాం. ధర అందరికీ అందుబాటులో ఉంది. ఎక్కువగా ఎండలు ఉంటున్న సమయంలో ముక్కలుగా కోసి అమ్ముతున్నాం. పుచ్చకాయలో ఉన్నంత నీరు మరే పండులోనూ ఉండదు.

– వెంకట రమణ,పుచ్చకాయల వ్యాపారి, కడప

వసతి గృహాల విద్యార్థులపై పర్యవేక్షణ

ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి


భోజనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: బోధన, పరిశోధనల పరంగా బిజీగా ఉన్నప్పటికీ వసతి గృహాల పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని యోగి వేమన విద్యాలయ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో వసతి గృహ సంక్షేమ అధికారులతో శనివారం ఉదయం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతి గృహాల విద్యార్థుల కోసం ఆంగ్ల, తెలుగు దినపత్రికలు తెప్పించనున్నామన్నారు. తద్వారా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు, సమ కాలీన సంఘటనలను ఎప్పటికప్పుడు తెలుసుకొనే సౌకర్యం కలుగుతుందన్నారు. విద్యార్థినులకు తైక్వాండో రెండో దశ శిక్షణ రెండు రోజుల్లో ప్రారంభించనున్నమన్నారు. అనంతరం బాలికల వసతి గృహానికి వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్.రామ్‌మనోహర్‌రెడ్డి, డాక్టర్.వరప్రభాకర్, డాక్టర్ డి.ఆర్.సతీష్‌బాబు, డాక్టర్.అను ప్రసన్న, డాక్టర్ జిల్లెల్ల మెర్సీ విజేత, డాక్టర్ పి సరిత, డాక్టర్ టి.సురేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో డిగ్రీ విద్యార్థిని అక్షయ ఆత్మహత్యకు హాస్టల్ వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కడప ఆర్ఎస్‌యూ కార్యాలయంలో విలేకరులతో ప్రశాంత్ మాట్లాడుతూ గతంలో ఇదే హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యయత్నానికి పాల్పడడం జరిగిందన్నారు. అధికారులు, సిబ్బందిలో ఏమాత్రం చలనం లేదని పేర్కొన్నారు. హాస్టల్‌పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సంఘటనలు జరుగుతున్నాయని వారు తెలిపారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలుసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ప్రమోద్, సాయి, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సూచించారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాల విద్యార్థులకు శనివారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి, పొగాకు, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాల అలవాట్లు విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాద్ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, ఈగల్ క్లబ్ కో ఆర్డినేటర్లు కెప్టెన్. డాక్టర్.నీలయ్య, డాక్టర్. సావిత్రి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్, డాక్టర్. నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూలో చెత్తా, చెదారం తొలగింపు


శుభ్రం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా నిరోధించాలని వైవీయూ ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యోగి వేమన విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైవీయూలోని హ్యూమానిటీస్, గురుకులం, ప్రిన్సిపల్ కార్యాలయ ప్రాంగణం, సైన్స్ బ్లాక్ పరిసరాల్లో చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగించారు. ప్రధాన ఆచార్యులు రఘునాథరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత సంకల్పంతో చేపట్టిన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె. లలిత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్రామిరెడ్డి, ఆచార్య చంద్రఓబులరెడ్డి, ఆచార్య సుబ్బరాయుడు, డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ పి సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.514.84 కోట్లతో నగరపాలక బడ్జెట్


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.514.84 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. శనివారం ఉదయం మేయర్ సురేష్‌బాబు అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాండింగ్ కమిటీ సభ్యుడు బాలస్వామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బజనవరిలో ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్‌ను మార్చిలో ప్రవేశపెట్టడం వల్ల ఉపయోగమేముందని ప్రశ్నించారు. కమిషనర్ సమాధానమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌కు, దీనికి సంబంధం లేదని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కొన్ని సవరణలతో దాన్ని ఆమోదించారని, 2024–25 సంవత్సర సవరణ బడ్జెట్‌ను 2023–24 సంవత్సరపు సవరణలోని అంతిమ విలువల ఆధారంగా తీసుకొని ఈ బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ సాధారణ, మూలధన అంత్య విలువ రూ.67.18 కోట్లను, 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రారంభ నిల్వగా చూపారు. 2025–26 సంవత్సరానికి రూ.514.84 కోట్లు రాబడి వస్తుందని భావించి రూ.447.28కోట్లు ఖర్చుగా చూపి, మిగిలిన రూ.67.55 కోట్లు మిగులు నిల్వగా చూపారు. అభివృద్ధి పనులకు కేటాయించిన మొత్తాలలో ఎస్సీలకు 15.20 శాతం, ఎస్టీలకు 6.60 శాతం, స్త్రీ, శిశు సంక్షేమం కొరకు 5 శాతం, వికలాంగులకు 3 శాతం నిధులు ఖర్చు చేయాలని, నికర నిధులతో 40 శాతం నిధులను మురికివాడల్లో అభివృద్ధి పనులకు వెచ్చించవలసిందిగా తీర్మానించారు. ప్రభుత్వం ద్వారా వివిధ గ్రాంట్ల రూపంలో 265.28 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు మగ్బూల్ బాషా, కె. బాబు, బాలస్వామిరెడ్డి, ఎస్. వాణి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలి


లేఖను చూపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర అసెంబ్లీలో ఆదోని భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే పార్థసారథి వాల్మీకి మత విద్వేష ప్రసంగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై తక్షణమే అనర్హత వేటు వేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. సదరు ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని ఆయన స్పీకర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ రాయచోటిలో వీరభద్రేశ్వరస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా జరిగిన గొడవల్లో మసీదు నుంచి వచ్చిన అల్లరి మూకలు దాడి చేశారంటూ దురుద్దేశపూర్వకంగా మాట్లాడడం దారుణమన్నారు. మతం, కులం పేరిట భారతీయ జనతా పార్టీ దేశమంతా చేస్తున్న అసాంఘిక, శాసన, చట్ట ఉల్లంఘన కార్యకలాపాలు రాష్ట్రంలో అవలంభించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. ముస్లిం మైనార్టీలనే టార్గెట్ చేస్తూ అల్లరి మూకలంటూ మాట్లాడినా.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఇతర సభ్యులు కూడా అభ్యంతరం తెలుపకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మయానా రహమతుల్లాఖాన్, చిన్న కుళ్లాయప్ప, సంజయ్ కాంత, హమీద్, గంగయ్య ,గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటాలి


స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ నాగరాజు

కడప రూరల్: ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని, తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సిబ్బంది పిచ్చి మొక్కలు చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, డాక్టర్ వెంకటచంద్రారెడ్డి, డీఎల్ఏటీఓ డాక్టర్ రవిబాబు, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం


ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ ఉద్యోగులు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా 3వ శనివారం రోజున స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఖాళీ ప్రదేశంలో ఆర్టీసీ ఉద్యోగులు శనివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రత చర్యలుచేపట్టారు. చివరగా స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం గజలక్ష్మి, ఏటీయం హరి, ఏటీయం(కమర్షియల్) జనార్దన్, కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, సిబ్బంది, గ్యారేజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

లామినార్ ఫ్లో ఓటీ ఆపరేషన్ థియేటర్ ప్రారంభం


గదిని ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కడప రూరల్: నగరంలోని ఐటీఐ సమీపంలో నూతనంగా నిర్మించిన వేదాంత హాస్పిటల్స్‌లో శనివారం లామినార్ ఫ్లో ఓటీ ఆపరేషన్ థియేటర్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలకు వెళ్లకుండా అన్ని సదుపాయాలతో అధునాతన టెక్నాలజీ ఆస్పత్రి ఏర్పాటుచేయడం హర్షనీయమన్నారు. నిష్ణాతులైన వైద్య బృందం ఇక్కడ అందుబాటులో ఉన్నారని తెలిపారు. డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ శివ శంకర్, డాక్టర్ దినేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి


ఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కడప అర్బన్: సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దె మద్దిలేటి, ఆయన తమ్ముడు మల్లికార్జునపై గంజాయి మత్తులో మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచిన కిషోర్, ప్రకాష్ తదితర గంజాయి మూకలపై హత్యాయత్నం, గంజాయి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈ శ్వరయ్య డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ గత ఆదివారం రాత్రి సాక్షి ఆఫీస్ సర్కిల్ వద్దగల పాత ఇనుప సామాన్ల అంగడి వద్ద సీపీఐ నాయకుడు మద్దిలేటి, వారి తమ్ముడు మల్లికార్జున తదితరులపై గంజాయి సేవించిన కిషోర్, ప్రకాష్, మరికొంతమందితో దాడి చేసి తీవ్రంగా గాయపరచారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, జిల్లా సమితి సభ్యులు వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన జాయింట్ కమిషనర్

చింతకొమ్మదిన్నె: మండలంలో జరుగుతున్న పంట కుంటలు, పండ్ల తోటల పెంపకం పనులను గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ శనివారం పరిశీలించారు. కుంట పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెంచుకుని రైతులు లబ్ధిపొందాలని కోరారు. పథక సంచాలకులు ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ రైతులు వారి పొలాలలో పంట కుంటలు నిర్మించుకోవాలని, ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా ఉపాధి హామీ నిధులు ఇస్తామన్నారు. ఇచ్చిన కొలతల మేరకు పని పూర్తిచేసుకుని 300 రూపాయలు కూలి పడేవిధంగా పని చేసుకోవాలని కూలీలను కోరారు. ఎంపీడీవో కుల్లాయిబాబు , ఏపీడీ సోమశేఖరరెడి పాల్గొన్నారు.

గంజాయిపై దాడులతో మెడికల్ షాపులకు యువత


సమావేశంలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్, సిబ్బంది

కడప అర్బన్: గంజాయి విక్రయాలపై పోలీసులు దాడులు జరుపుతుండడంతో మత్తుకు అలవాటుపడిన యువత మెడికల్ షాపులకు వచ్చే అవకాశం ఉందని వన్ టౌన్ సీఐ బి.రామకృష్ణ మెడికల్ షాప్ నిర్వాహకులకు సూచించారు. కడప డీఎస్పీ కార్యాలయంలో కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ సమష్టిగా కృషి చేసి డ్రగ్ రహిత సమాజం తయారు చేయాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మెడికల్‌షాపులకు మత్తు కలిగించే మందుల కోసం ఎవరైనా వస్తే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్ ఇన్స్‌పెక్టర్ జి.మాధవి మాట్లాడుతూ వైద్యులు వ్యాధి నయం చేసేందుకు ఉద్దేశించి వ్రాసిన ప్రిస్క్రిప్షన్ వున్న వారికి మాత్రమే మందులు విక్రయించాలన్నారు. ఆర్ఎక్స్ఎన్, ఆర్ఎక్స్‌ల పేరిట వర్గీకరించి వైద్యులు సిఫారసు చేసి మందులను విక్రయించినపుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ ఇన్స్‌పెక్టర్ రమణారెడ్డి, ఎస్.ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిపూట తరగతులు పెట్టాలని వినతి


రిజిస్ట్రార్‌కు విన్నవిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడప జిల్లాలో ఎండలు పెరిగిన నేపథ్యంలో యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఒంటి పూట తరగతులకు అనుమతి ఇవ్వాలని కడప జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శశికాంత్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి శ్యాసుందర్‌రావు కోరారు. వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మను ఆమె చాంబర్‌లో శనివారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఎండల తీవ్రత బాగా పెరిగిందన్నారు. ఒంటి పూట తరగతులకు అనుమతులను ఇవ్వాలని కోరారు. స్పందించిన రిజిస్ట్రార్ పుత్తా పద్మ స్పందిస్తూ ఫైల్‌ను వెంటనే వైస్ ఛాన్సలర్ కార్యాలయానికి పంపి అనుమతి వస్తే తెలియజేస్తామని అన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న మైనార్టీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప గౌస్ నగర్‌లో తాగు నీటి సమస్య పరిష్కరించాలని ముస్లిం, మైనార్టీ నాయకులు పి.ఖాదర్‌బాషా, అమానుల్లా షేక్ కోరారు. గత నాలుగు రోజులుగా నీళ్లు రాకపోవడంతో శనివారం వారు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌస్ నగర్‌లో నీటి కొరత ఉందన్నారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయడం లేదని, రంజాన్ మాసంలోనూ సక్రమంగా నీరు అందించలేకపోవడం దారుణమన్నారు. స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ర్యాలీ

కడప ఎడ్యుకేషన్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.జ్యోతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలన్నరు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీలు దామోదర్, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.